
కథ

# ద్రోహం

దేవులపల్లి కృష్ణమూర్తి

**నా హైస్కూలు చదువు అయిపోయింది. అనుకున్నట్లుగా మార్కులు రాలేదు. సెకండు క్లాసులో పాస్ అయిన. ఈలోగా, మా అమ్మకు నల్లగొండ హాస్పిటల్‌కు హెడ్‌నర్సుగా ప్రమోషన్‌పై బదలి అయ్యింది. నల్లగొండ కాలేజిలోనే జాయిన్ అయిన. చదువు బాగానే సాగుతుంది. కాలేజికి గేటు నుండి పోతుంటె లతీఫ్‌సాబ్ గుట్ట ఓ అందమైన పేంటింగులా కన్పడుతుంది. బోయవాడలో ఇల్లు కిరాయకు తీసుకున్నం. ఇది హాస్పిటల్‌కు నా కాలేజికి దగ్గరగా వుంటుంది.**



కాలేజిలో కొత్తకొత్త మిత్రులు- అంతా కొత్త వాతావరణం. నాకు మిర్యాలగూడ వాసి శేషు అనబడె శేషాచార్యులతో మైత్రి యేర్పడింది. అతడు నా మాదిరిగనే బక్కపల్చగా వుండేవాడు. ఎప్పుడూ అదోఇదో మాట్లాడుతుండేవాడు. వాళ్లక్కయ్య ఇంట్లో వుంటుండె. అతని వద్దకు మిర్యాలగూడ నుండి చెన్నూరి నాగరాజు వస్తుండేవాడు. వాడొచ్చినపుడు అన్నీ కబుర్లే. మంచి కాలక్షేపం జరిగేది.

శేషుకు పుస్తకాలు చదివే అలవాటుండేది. నేను మొదట మొదట వాటిపై శ్రద్ధ చూపలేదు. ఒకనాడు ఇది చదువురా అంటూ 'రాత్రి' అనే కవితా సంపుటి ఇచ్చిండు. అది వచన కవిత్వం: చాలామంది కవుల కవితలు అందులో వున్నయి. చదివినగాని అంతగా ఎక్కలేదు. ఇంకోసారి 'మహాప్రస్థానం' ఇచ్చిండు. ముందుమాట చదివిన. అది ఓ ప్రవాహంలాగుంది. తర్వాత కవితా ఖండికలు చదవటం మొదలుపెడితే- పుస్తకం అయిపోయిందాక వదలలేదు. అదే విషయం శేషుతో చెబితే- మన తరం చేసుకున్న అదృష్టం. ఆ మహాకవి జీవించి వున్నంతకాలంలో మనం వున్నాం. వారిని మన కాలేజికి లిటరరి పంక్షనుకు పిలవాలనుకుంటున్నం. కుదురుతుందో లేదో చెప్పలేను.

శ్రీశ్రీని పిలవటం కుదిరింది కాదు. హైదరాబాదులో వుంటున్న కుందుర్తిని పిలిచినం ఆ సాహిత్య సభకు. బాగా జరిగింది కుందుర్తి గారు వచన కవిత్వం ఉద్యమంగా రావాల్సి వుందని, కావ్యాలన్ని వచన కవిత్వంలో వస్తె బాగుంటుందని, జనానికి బాగా చేరువౌతుం దని చెబుతూ తను అందుకే ఫ్రివర్స్ ఫ్రంటు యేర్పాటు చేశానని చెప్పుకొచ్చారు. నాకు అంతగా ఎక్కింది కాదు. ఆ సభవున్న విషయం తెల్సి నాగరాజు కూడా వచ్చిండు. శేషు బాగా ఎంజాయ్ చేసిండు.

హైద్రాబాదు నుండి అప్పుడప్పుడు శలవుల్లో మా చిన్న అమ్మమ్మ కొడుకు వెంకటేశ్వర్లు మా ఇంటికి వస్తుండేవాడు. వాడికి పుస్తకాల పిచ్చి ఎక్కువనే చెప్పొచ్చు. వాడొచ్చేటప్పుడు రెండో మూడో 'నవత' అనే పత్రికలు పట్టుకొచ్చిండు. దానిపై సాహిత్య సాంస్కృతిక త్రైమాసిక పత్రిక, గౌరవ సంపాదకులు శ్రీశ్రీ అని వుంది. శ్రీశ్రీ అంటే అభిమానం గదా అలా వాటిని చదివిన. అంతా కొత్తగా అనిపించింది. వెంకటేశ్వర్లు అన్ని విడమరచి చెప్పిండు. కాలేజి పుస్తకాలు కాక ఇతర పుస్తకాలు చదవటం అలవాటుగా మారింది.

సంవత్సరానికి ఒకటి రెండుసార్లు మా హన్మంతు మామయ్య వస్తుండేవాడు. పొలంలో పండిన వడ్ల డబ్బులు అమ్మకు ఇచ్చి పోతుండేవాడు. అప్పుడప్పుడు శలవుల్లో నేను మా మామయ్య ఊరికి పోయి రెండు మూడు రోజులుండి వస్తుండేవాడిని. కాని అమ్మ మాత్రం ఎన్నడు రాకపోయేది. మా మామయ్య ఎన్నోసార్లు పండగ పబ్బాలకు రమ్మన్నా వచ్చేదికాదు.

అమ్మకు హాస్పిటల్ డ్యూటి తర్వాత ఇల్లు సర్దుకోవటంతోటే సరిపోయేది. దినపత్రికలు తప్పకుండా చదివేది. ఎవ్వరితో ఎక్కువ స్నేహం చేసేదికాదు. ఆమెకు డ్యూటీయే దైవం. మా స్నేహితులు వచ్చినపుడు మంచిగా ఆదరించేది. ఎక్కువగా శేషు, నాగరాజు మాత్రమే వచ్చేవాళ్లు. వాళ్లు అమ్మా, అమ్మా అంటూ పిలిచేవాళ్లు. అప్పుడప్పుడు పేట నుండి మా చిన్న అమ్మమ్మ వచ్చి పోతుండేది. నాకు అంతా అమ్మ తరఫువాళ్లే చుట్టాలు. మా నాన్నను నేను చూడ లేదు. నేను కడుపులో వున్నప్పుడు తెలంగాణ సాయుధ పోరాటం లో మిలట్రి కాల్పుల్లో చనిపోయిండని మాత్రం తెలుసు. నాన్న విషయం అడిగితె అమ్మ ఏడ్చేది. అందుకని అడగటం మానుకున్న.

మా మామయ్య వూరికి పోయినపుడు మా అత్తే చెప్పుతుండేది. ఆ ఊరి బయట కాంపాడు, దోసపాడు పోయే బాటలో వున్నది మీ ఇల్లే. ఇల్లేం లేదనుకో. గోలలప్పుడు అందరూ ఇల్లు వాకిలి వదలిపోయిండ్రు. తర్వాత ఆ కొంప కూలిపోయింది. కొన్నాళ్ల తర్వాత మీ పెదనాయన వచ్చి కాలిజాగాను గౌండ్లోల్లకు అమ్ముకపోయిండు. ఆ సాలోల్ల బజారంతా మాయమైపోయింది. వాళ్లు ఎక్కడెక్కడికి పోయిండ్రో ఎక్కడుంటుండ్రో తెల్వదు.

"మీ అమ్మ ఎన్నడూ, మా మాట వినేది కాదు నాయనా! చక్కదనాల సంబంధాలు ఎన్నొచ్చివయి, కాని ముందర పడనిచ్చిందా? ఎక్కడి మాయగోలలొచ్చెనో ఆ మాయ సత్యం వలలో పడిపాయె. ఆ బదనాం మోయలేక దగ్గరి వూరైతే అందరికి తెలుస్తదని దూరపు చుట్టరికం చేస్తిమి. అది బుగ్గాయె. తర్వాత ఉన్నది ఉన్నట్లుండక చెప్పా పెట్టకుండా పోయి సంగంలో కల్సి మల్ల సత్యాన్నె పెండ్లాడె." అంటూ చెప్పుకొచ్చేది. దానితో నాకు అన్ని విషయాలు అర్థం అయ్యేవి.

ఆ వూర్లో నాకు తెల్సినవాళ్లు ఎవరూ లేరు. చుట్టుపక్కల ఇండ్లోల్లు లక్ష్మికొడుకువు గద నాయనా! బాగున్నవా, మీ అమ్మ బాగుందా అంటూ అడిగేవాళ్లు. నేను ఊం, ఆం అంటూ బదులిచ్చేవాణ్ణి.

అక్కసుకొద్ది చెప్పినా మా అత్త అన్ని విషయాలు చెప్పినట్లె అయ్యింది. అప్పుడప్పుడు సూర్యాపేట అమ్మమ్మ చెప్పిన విషయాల

వల్ల మా కుటుంబం విషయం అవగాహనకు వచ్చింది. మా నాయన, అమ్మ తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నరని, అక్కడే వివాహం చేసుకున్నరని. తదుపరి మా యమ్మ పడ్డ కష్టాలన్ని ఒక్కటొక్కటిగా తెలియబట్టినవి. కనీసం మా నాన్న ఫోటో చూద్దామన్నగని లేదు. "నీది అచ్చం మీ నాన్న పోలికేరా! అందుకే నాకు భయమవుతుంది. నువ్వు ఏమౌతవోనని" మా అమ్మ అంటుండేది.

** ** **

శేషు మూలంగా కవిత్వాన్ని ఆస్వాదించటం ఆనందాన్నిచ్చింది. తెలుగులో కవిత్వంలో పెనుమార్పులు వస్తున్నాయని చెబుతూ సి.వి. రచనలతో పరిచయం చేసిండు. తదుపరి దిగంబర ఉద్యమం వచ్చిందని ఆ కవిత్వాన్ని పరిచయం చేసిండు. దిగంబర కవిత్వం నన్ను అమితంగా ఆకర్షించింది. అందులోని ప్రతి కవిత సమాజానికి పట్టిన చీడను వదిలించేదిగా కన్పించింది. కవిత్వంతోపాటుగా రావిశాస్త్రి కథలు, నవలలు, కుటుంబరావు సాహిత్యం నన్నాకర్షించి నవి. బుచ్చిబాబు కథలు బాగా చదివించనయి.

శేషుతో నా స్నేహం ఎలా మొదలైందో చెప్పాలి.

రామగిరి సెంటర్‌లో నేను రంగారావు మొదలగు వాళ్లం అంకమ్మ హోటల్లో సింగిల్ టీ త్రాగుతూ గప్పాలు కొడ్తుండేవాళ్లం. రంగారావు శ్రోతలు కోరిన పాటలకు రేడియో కేంద్రానికి ఉత్తరాలు రాసెవాడు. ఆ ఉత్తరాలు వాని పేరునగాక వింతవింత పేర్లతో ఫలానా పాట కావాలని వ్రాస్తుండేవాడు. ఈరోజు ఫలానా, ఫలానా పేరుతో శ్రోతలు కోరిన పాటలు వస్తాయి చూడురా అంటూ చెప్పేవాడు. వాడు చెప్పినట్లుగానే ఆ పాటలు, పేర్లు రేడియోలో వినిపించేవి. వీడు భలేగుండె అని అనుకునేవాళ్లం.

శేషు బక్కపలచని ముఖం. ఫేస్ వాల్యు అంతగా వున్నట్లు కన్పించదు. జర్దా పాను నములుతుండేవాడు. దానికితోడు పర్సనాలిటి లేకున్నా దాదాగాడు పెట్టినట్లు పోజులు పెట్టెటోడు. తోడుగా ఓ ముస్లిం దాద. వానికి మంచి పర్సనాలిటి కండలు తిరిగిన దేహం వుంది. వాని పేరు షేక్ అలి. వాడు శేషు ఎక్కడుంటే అక్కడుండె టోడు. ఇద్దరు కల్సి శేర్ బంగ్లా దగ్గర అక్క ఇంటి నుండి వచ్చె టోల్లు. శేషును చూచి మిగతా క్లాస్‌మేట్స్ విష్ చేసేవారు, ఎట్లంటే- సినిమాలో దాదాలకు భయపడ్డు ఎట్ల దండాలు పెడ్తరో అట్ల.

వీడేందిరా, పిట్టలాగుండు వీనికొక బాడిగార్డు- ఆ పనికిమాలిన పర్సనాలిటి చూచి అందరు భయపడ్తూ దండాలు పెట్టుడేంది అనుకుంటూ నేను కేర్ చేసెవాణ్ణి కాదు. అందరు నన్ను చూచి విష్ చేస్తరు వాడు నన్ను లెక్కచేయడేంది అన్నట్లుండేవి శేషు చూపులు. కొంత కాలానికి వాళ్లక్క సత్యనారాయణ వ్రతం చేస్తుందని తన స్నేహితులందరిని పిలిచిండు. నేను అంకమ్మ హోటల్ దగ్గరకు వచ్చేవరకు ఎవరులేరు. శేషు ఇంట్లో వ్రతం చేస్తుండ్రని అందరు

శేషు బక్కపలచని ముఖం.
ఫేస్ వాల్యు అంతగా వున్నట్లు కన్పించదు.
జర్దా పాను నములుతుండేవాడు. దానికితోడు
పర్సనాలిటి లేకున్నా దాదాగాడు పెట్టినట్లు పోజులు
పెట్టెటోడు. తోడుగా ఓ ముస్లిం దాద. వానికి మంచి
పర్సనాలిటి కండలు తిరిగిన దేహం వుంది

అక్కడికి పోయిండ్రు. నువ్వు పోలేదేంది అంటూ అంకమ్మ అన్నది. నన్ను హోటల్ కాడ చూచి జగదీష్‌గాడు శేషుకు చెప్పినట్లుంది. మళ్లీ జగదీష్‌గాడే వచ్చి శేషు రమ్మంటుండురా, అని చెప్పిండు. మీ అందరికి ఒకరోజు ముందు చెప్పి నన్ను ఇప్పుడు రమ్మంటె ఎట్లొస్తనని అనంగనే వాడు పోయి శేషుకు చెప్పినట్లుంది. దానితో శేషు అంగి తొడుక్కోకుండనే ఇంటిముందుకొచ్చి నన్ను పిలిచిండు. ఇవా బాగుండదని దగ్గరికి పోయిన. సంగతేంది అంటే- "నేను మన మిత్రులందరిని భోజనానికి పిలువాలనే వంకతో చిన్న వ్రతంలాంటిది పెట్టుకున్న అందరు వచ్చిండ్రు. నువ్వు కూడా రా" అనంగనే "తీరా వ్రతం మీదకూర్చొని నన్ను పిలుస్తవా"

"నువ్వు ఎట్లన్న అనుకో- హోటల్ కాడికి వస్తవు గదా అప్పుడు పిలుద్దామనుకున్న"

"ఒకవేళ నేను హోటల్ కాడికి రాకుంటే ఏం చేద్దువు"

"నీ ఇంటికి మనిషిని పంపుదామనుకుంటిని'

"నేను లేకుంటే?"

"నువ్వు వచ్చేవరకు వ్రతం ఆపేవాణ్ణి" అనటంతో నాకు ఏడ్పువచ్చింది. వెంటనే కౌగిలించుకున్న. భుజంపై చేయి వేసి ఇంట్లోకి తీసుకపోయిండు. అలా మా మైత్రి మొదలైంది.


** ** **

ఆరోజు అమ్మకు నైట్ డ్యూటీ కాదు. అయినా గాని ఇంటికి రాలేదు. తెల్లారి వచ్చింది. చాలా అలసిపోయి ముఖమంతా వాచిపోయి వుంది. ఏనాడు ఇంత విచారంగా వుండటం చూడలేదు. నేను త్వరత్వరగా తయారయ్యి కాలేజికి పోయిన. ఆ రోజంతా అమ్మ ఇంటికాడనే వున్నట్లనిపించింది.

అమ్మా ఎందుకట్లున్నవు అని అనంగనే గోడున ఏడ్చింది. నాకేటూ అర్థం కాలేదు. తర్వాత నెమ్మదిపడి-

"ఏం లేదు నాయనా! నిన్న నేను డ్యూటి దిగి వద్దామని తయారవుతుంటే ఒక యమర్జెన్సి కేసు వచ్చింది. ఎవరో అమ్మాయి పాయిజన్ తాగిందని చెప్పిండ్రు. మాతోటి నర్సు సుగుణ- ఆ కేసేందో చూద్దాంరా, అంటే పోయి చూద్దునుగదా, ఆ అమ్మాయి ఏదో పురుగుల మందు తాగినట్లుంది. కొంచెం కొన ఊపిరి ఉన్నట్లుంది. డాక్టరుకు చెబితే, వెంటనే వాంపిటింగ్ చేయించడం, గ్లూకోస్ ఎక్కించడం మొదలుపెట్టిండు.

ఆ అమ్మాయి పద్దెనిమిదేండ్లుంటుంది. వట్టి మనిషి కాదనిపించింది. కడుపు కాస్త లావుగా వుంది. వెంట వచ్చినామె ఒకటే యేడ్పు. ఆమె వెంట ఒక అబ్బాయి నీ ఈడువాడే వుండు. మందులు తేవడం అటు ఇటూ తిరుగుతుండు. అమ్మాయి తల్లి ఒకటే యేడ్పు. చూచిన ముఖమోలిగనే అనిపించింది. దగ్గరికి పోయి చూచేవరకు రామనర్సమ్మే! అరె మన కామ్రేడ్ రామనర్సమ్మే! ఎన్నాళ్లకు కన్పించింది. ఆ దుఃఖంలో ఏమని మందలిద్దును. మొదట అమ్మాయిని బ్రతికించాలని డాక్టరు వెంట వుండి అన్ని సపర్యలు చేయటం మొదలుపెట్టిన. ఎంత ప్రయత్నం చేసినా అమ్మాయి బ్రతుకలేదు.




తెల్లారగట్ల నాల్గింటికి ప్రాణం పోయింది. పురుగుల మందు తాగి చాలాసేపయ్యింది, వెంటనే చూడకపోవటం మూలంగా

హాస్పిటల్‌కు తీసుకరాకపోయింంద్రట. ఇవా పోస్టుమార్టం పోలీసు విచారణ అయ్యేవరకు మధ్యాహ్నాం అయితదని మరల కలుస్తనని రామనర్సమ్మ ఇంటి అడ్రసు తీసుకొని ఇంటికొస్తి. నీవేమో కాలేజికి పోయే తొందరలో వుంటివి. తర్వాత చెబుతామనుకుంటె, చూస్తూ చూస్తూనే మూడురోజులాయె. ఇవ్వాల ఆదివారం నీకు శలవు నాకు డ్యూటి లేదు. ఇప్పుడు దొరికింది చూడు తీరిక.

రామగిరి దేవాలయం పక్కసందులోనే రామనర్సమ్మ కిరాయి కుంటుంది. మొన్న నేను పోయె వరకు పోస్టుమార్టం అయ్యి శవాన్ని ఇంటికి తీసుకొచ్చింంద్రు. దహనం అయ్యేవరకు సాయంత్రం అయ్యింది.

రామనర్సమ్మ ఎవరనుకున్నవు, అప్పట్లో మేమంతా పార్టిలో పనిచేసినోల్లం. రామనర్సమ్మది యల్లయ్యది ఒకే వూరు. పక్కపక్క ఇండ్లే కాని కులాలు ఒకటి కావు. చిన్నప్పటి నుండి ఒకరంటె ఒకరికి ప్రేమ. కులాలు ఒకటి కాకపోవటంతో పెండ్లి కుదిరేటట్టులేదు. అసలే ఆ వూర్లో రెడ్డోల్ల పెత్తనం. ఈ మాట చెవులబడితె బతకనిస్తవా! ఎటన్న లేచిపోదామన్న వూపులో వుంంద్రు.



ఇంతలో సంగం గ్రామములోకి వచ్చింది. ఊరేగింపులు, సభలు, సమావేశాలు ఏర్పాటుచేసి పటేలు పట్వారి బంగ్లాలు కూలగొట్టి దస్త్రాలు తగులబెట్టింంద్రు. అందులో యల్లయ్య చురుకుగా పాల్గొండు. పాటలు పాడ్తడాయె మంచి మాటకారి కూడ. సంగంపోల్లతోటి సంబంధాలు యేర్పడ్డయి. పెద్దలతో చెబితే ఈ పెండ్లి అయ్యేది కాదని రామనర్సమ్మను తీసుకొని రాచకొండ దళంలో కల్సిండు. పార్టివాళ్లే పెండ్లి చేసింంద్రు.

రాచకొండ దళంలో మేము కల్సి పనిచేస్తున్నప్పుడు నాకు రామనర్సమ్మకు దోస్తానా అయ్యింది. ఇంతలో పోరాట విరమణ చేద్దామా వద్దా అనే చర్చలు జరుతున్నప్పుడు మిలట్రీ మా క్యాంపు మీద దాడి చేసింది. అందులో మీ నాన్న చనిపాయెగదా. చెట్టుకొకరం పుట్టకొకరం అయినం. మల్లి రామనర్సమ్మ యల్లయ్య జాడ దొరకలేదు. నాదెవులాటలో నేనుంటి. ఎవరిని పట్టించుకునేటట్లుంది!

ఇంతకాలానికి రామనర్సమ్మను మొన్న రాత్రి చూడడం అయ్యింది. ఎట్లాటి పరిస్థితిలో చూడడం జరిగిందో చూడు- బిడ్డ చావు బ్రతుకుల్లో వుంది. గుర్తుపట్టినగని, ఏమని మాట్లాడను. బిడ్డకు వైద్యం ముఖ్యం కదా. అందుకని ఆ పనిలో వుంటి. ఎంత తిప్పల బడ్డా బిడ్డ బ్రతకదాయె.

నిన్న రామనర్సమ్మ ఇంటికి పోయిన. కౌగలించుకొని ఏడ్వబట్టింది. ఆ దుఃఖం నేనెలా తీర్చగలను. ఆఖరికి మాట్లాడింది. నా గూర్చి తెల్సుకుంటూనే వుందట. ఎక్కడో హైద్రాబాదులోనే వుంటున్ననని అనుకుంటుందట. అప్పుడప్పుడు ఎర్రబోతు రాంరెడ్డి కల్సి అప్పటి సంగతులన్ని చెబుతుంటడుగాని రామనర్సమ్మ విషయాలే ఎన్నడు చెప్పలే.

రామనర్సమ్మ చెప్పబట్టింది:

"కాల్వపల్ల ఎర్రసత్యం చనిపాయెగదా, మా యల్లయ్య తెలివి కల్లోడాయె. సెంట్రి డ్యూటి చెయ్యమంటె తెల్లారగట్ల చేస్తనని ఎక్కడో పడుకుండట. మనమంతా సమావేశంలో వుంటిమి. ఇంతల్లనె కాల్పులాయె. అనుకోని సంఘటనకు ఎక్కడోల్లం అక్కడికి పారిపోతిమి. రెండురోజులకు జనగాం తండలో యల్లయ్య నేను కల్సుకున్నం. ఇవా ఎక్కడికి పోవాలన్నదే దెవులాట. యల్లయ్య దూరపుచుట్టం మునుగోడులో వుంటె అక్కడకి చేరుకున్నం. వాళ్లు మమ్ముల బాగనే చూసుకుంంద్రు. ఇంతలో పిల్ల పుట్టె. అంతకు ముందోడు పిల్లగాడు గదా. మా పుట్టింటోల్లకు తెల్సింది. అయ్యిందేందో అయ్యింది ఇక్కడే వుండండి అంటూ ఓ నాల్గు ఎకరాల చెల్క కొనిచ్చిండు మా నాయన. అందులో బాయి తీయించుకున్నం. చిన్నగ వ్యవసాయం చేయబట్టినం.

మా పని మేము చేసుకుంటూ బ్రతుకుతుంటే ఎక్కడెక్కడివో పాత కేసులు తోడి యల్లయ్యను పోలీసులు పట్టుకపోయింంద్రు. స్టేషన్ చుట్టు తిరగడం, ఎప్పుడు భయం భయంగనే వుండేది. ఆఖరికి మా నాయనకు తెలిసి వచ్చిండు. మునుగోడు రామక్రిష్ణారెడ్డి మాకు దూరపు బంధువైతడు. ఆయన కాడికి మమ్ముల తీసుకపోయిండు. దానికి ఆయన- 'కమ్యూనిష్టు పార్టిలో వుంటే పోలీసులు సతాయిస్తరు- కాంగ్రెసు పార్టిలో చేరండి, ఏ ఇబ్బందులు వుండవు" అంటే- దినగండం నూరేండ్ల ఆయుష్షని సరె నన్నం. దానితో పోలీసులు మా వెంట పడటం తక్కువైంది. బావిలో నీరు బాగనే పడ్డది. కొంత తరి, కొంత ఖుష్కి చేయబట్టినం. చేతిలో పైసలు కన్పడబట్టినయి. యల్లయ్య ఖద్దరు బట్టలు కట్టి పైరవీలు చేయబట్టిండు. నేనేమో జీతగాణ్ణి పెట్టుకొని వ్యవసాయం చేయించేది. పిల్లలు పెద్దవుతుంంద్రు. అక్కడే బడికి పోతుంంద్రు. ఆర్థికంగా బాగనే పుంజుకున్నం.

రామక్రిష్టారెడ్డి యం.పి. అయ్యిండు. యల్ల్య ఆయనను పట్టుకొని ఇద్దరు ముగ్గురికి నౌకరి ఇప్పించిండు. దానితో ఆయన చుట్టు నౌకరీల కొరకు పైసలు పట్టుకొని తిరగబట్టింంద్రు. ఒక ముండరాలు తనకు ఏ దిక్కు లేదని పదో తరగతి వరకు చదువుకున్ననని కుట్టుపని వస్తదని ఏదన్న నౌకరి ఇప్పించమని రెండు నెలలపాటు తిరగంగ తిరగంగ సరె చూద్దామన్నడు యల్లయ్య. ఆ ముండరాలు ఎర్రగా అందంగానే వుందనాలె. దానిమీద కన్నుబడింది. ఆఖరికి అటోఇటో చేసి కుట్టుమిషన్ కేంద్రంలో నల్లగొండల నౌకరి యిప్పించిండు. విషయం తెల్సి నిలదీస్తె అవును ఆమెను చూసుకున్న. ఆమెతోనే వుంట. ఏం చేసుకుంటవో చేసుకో అని దబాయించిండు. పోలీసుస్టేషన్‌లో కేసు బెడ్తె వానికాడ ఏముందని- వానికే ఆ ముండ తిండి బెడ్తుంది నీకేం ఇస్తడమ్మా అంటూ చెప్పుకొచ్చింంద్రు. అప్పటి నుండి నా బతుకు నేను బతుకుతున్న.

కొడుకు జగన్ పదో తరగతి అయిపోయినాక పిల్లల చదువు కోస మని నల్లగొండకు చేరుకుని చదివించుకుంటున్న. భూమి కౌలుకిచ్చిన. ఇది మా చుట్టపోల్ల ఇల్లు. ఖాలి జాగ వుందని రెండు బర్లను పెట్టు కొని పాలు అమ్ముకుంటూ బతుకెల్లదీస్తున్న. బాగనె బతుకుతుంటి.

జగన్‌గాడు డిగ్రి రెండో సంవత్సరం చదువుతుండు. డిగ్రి అయిపోయిన తర్వాత పోలీసు యస్సైకావాలని కలలు కంటుండు. మనిషి మంచి హాజంగ వుండు. అమ్మాయి ఇంటర్‌లో వుంది.

కొత్తగా ట్రాన్సుపర్ అయి వచ్చిన యస్సై మా పక్క ఇంట్లో దిగిండు. మహా అంటే 27, 28 ఏండ్లుంటయనుకుంట. మా జగన్ అప్పుడప్పుడు అతని కాడికి పోయి అదో ఇదో ముచ్చట్లు చెప్పు తుండెటోడు. ఆ యస్సైకి బుల్లెట్ సైకిల్ మోటరుంది. మా వాడు ఆ బుల్లెట్ వేసుకొని అప్పుడప్పుడు తిర్గుతుండెటోడు. వాడు యస్సై కావాలని కలలు కంటుండెగదా. పిల్లగాడు గదా నేనెలాగు కొనియ్యక పోతి, తిరిగితే తిరిగిండులే ననుకుంటి. ఎన్నడూ మందలించలేదు.

పోయిన దసరానాడు జగన్ 'అమ్మా ఆ యస్సై ఒక్కడే వుంటుండు గదా భోజనానికి పిలుద్దామే' అంటె సరె నన్న. భోజనం చేసిండు. మాటల సందర్భంగా తనది గుంటూరు అని రెడ్డోల్లమని చెప్పిండు. ఇంకా పెండ్లి కాలేదని చెప్పిండు. పిల్లగాడు బాగానే వుండనిపించింది. అప్పుడప్పుడు ఇంట్లోకి వస్తుండెవాడు. పిల్లలతో అదో ఇదో మాట్లాడు తుండేవాడు. బుల్లెట్ షోకుతో మావాడు కాలెజి నుండి రాగానే ఆ ఇంట్లో జొరబడుతుండేది. రానురాను మా అమ్మాయి కూడా

జగన్‌తోపాటు వెళ్లుతుండేది.
మా జగనే ఒకటి రెండు సార్లు మన మంజులను ఆ యస్సైకి ఇస్తె బాగుంటదే అని అని వుండె. పోరా! వాళ్లతో మనం తూగలేం అని వూరుకుంటి. కాని లోపలలోపల నా బిడ్డను చేసుకుంటే ఈడుజోడూ బాగుంటదనిపించింది. పిల్ల ఏపుగా పెరిగింది. వున్న వయసుకంటె ఎక్కువనిపిస్తుంది. కుదిరితె బాగనే వుంటదనుకున్న.

నా పనిలో నేనుంటుంటి. పిల్లలు కాలేజికి పోయి వస్తుండిరి. భూమి కౌలు కుదిరించుకుందామని మునుగోడు పోయిన. పని జరుగలేదు. రెండుమూడురోజులుండాల్సి వచ్చింది. నేను లేనప్పుడు పిల్లలే వండుకుంటుంటరు. అమ్మాయి పాలు పిండి వాడి కోల్లకు పోస్తుంటది. నేను లేనన్న ఇబ్బంది వుండదు. నాల్గురోజులు లేనుగదా ఈ పోరి దాని ఇష్టం వచ్చినట్లు ఆ యస్సైగానితో గడిపింది. జగన్‌గాడేమో బుల్లెట్ షోకులో వాని తిరుగుడు వానిదాయె.

మూడు నెల్లయినాక బయటపడ్డది. ఏందిది అని లబోదిబో అంటూ మొత్తుకుంటే- ఆ యస్సైగాడు పెండ్లి చేసుకుంటనన్నడు అంటూ చెప్పుకొచ్చింది. నేను మా చుట్టపాయన గల్సి ఆ యస్సైని నిలదీసినం. అప్పుడు చెప్పిండు. తనకు పెండ్లి అయ్యిందని. ఒక పిల్లగూడ వుందని. ఇహ ఏమి చెయ్యాలె- తల బట్టుకున్న. అమ్మాయికి నాల్గోనెల వచ్చింది. ఏందే ముదనష్టపుదాన ఇట్ల జేస్తివి అంటే ఏడుస్తది. జవాబు చెప్పదు. మేము ఆ యస్సైగాడిని నిలదీసిన రెండో రోజు నుండి శలవు పెట్టి గుంటూరు పోయిండు.

ఎవరికి చెప్పుకునేటట్లు లేదు. ఆఖరికి యస్పి కాడికి పోయి చెప్పుదామనుకున్న. తెల్సినోల్లు, వాడికి పెండ్లయ్యిందిగదమ్మా ఏమని కేసు బెడ్తం. కేసు బెట్టిన పెండ్లి చేసుకుంటడా. ఇదంతా బయటపెట్టుకుంటే మన పిల్లె బద్‌నాం అయితది గదా అని అనుకొచ్చింద్రు.

ఏం చేయాలే దేవుడా అనుకుంటూ నాకు తెల్సిన చిన వెంకట్రామరావు వకీలు కాడికి పోయి వచ్చేవరకు అమ్మాయి అర్రల పడుకుంది. నా పని చేను చేసుకుంటున్న. పొద్దూకింది. పిల్ల ఇంకా లేవలేదేంది అని పోయి చూచేవరకు నోటినుండి నురుగులు కారుతున్నయి. గుండె గుభిల్లుమంది. పక్కనున్న మా చుట్టపాయనకు చెప్పంగనే వచ్చిండు. పొలానికి పురుగు తగిలిందంటే పురుగులమందు తెచ్చివుంటి. దాని మూత తీసి వుంది. అమ్మా ఇది మందు తాగిందిరా, అని అనుకున్న. వెంటనే దవాఖానకు తీసుకొచ్చిన. ఆఖరికి నాబిడ్డను మట్టిపాలు జేసిన.

ఎక్కడి మాయదారి మందులొచ్చెనో- పంటలు బాగనే పండుతున్నయి గని దానితోపాటు మనుషుల పాణాలు పోతున్నయి. ఆ మందు డబ్బా ఇంట్లో లేకుంటే నా బిడ్డ బతికిపోవు. బంగారంగ సాదుకున్న బిడ్డ మట్టిపాలాయె. కొడుకు చెట్టంతయ్యిండు. చెబితె వినడు. వాని తిరుగుల్లు వానియి. అన్ని అయ్య బుద్దులే అబ్బినయి. దోస్తులంటూ తిరిగి తిరిగి రాత్రి ఎప్పుడో వస్తడు. వయసొచ్చిన కొడుకును ఏమందును. వాని సైకిల్ మోటర్‌షోకు నా కొంప ముంచింది. బిడ్డను పొట్టన బెట్టుకుంది. అమ్మ అయ్యని కాదని వాని వెంట సంగంలోకి పోతె వాడు నడమంత్రాన ముంచె. ఆఖరికి పిల్లల నామీదేసి వాని సుఖం చూసుకోబట్టె.

"కమ్యూనిష్టు అయి వుండి యల్లయ్య ఇట్లెట్లయ్యిండు?"

కమ్యూనిజాన్ని తుంగలో తొక్కిండు. పార్టి మారిండు, మోసాలు చెయ్యటం మొదలుపెట్టిండు. మాజి కమ్యూనిష్టులు చేసినన్ని మోసాలు వేరేవాళ్ల చెయ్యలేరమ్మ- చూస్తున్నగదా. హాయిగా పైరవీలు చేసుకుంటూ-ఆ ముండకాడుంటుండు. బిడ్డఇట్ల చచ్చిపోయిందని చెప్పి పంపినా ఆ కఠినాత్ముడు వచ్చి చూచిపోలె. అంత రాతిగుండె వాంది."

పోయ్యొస్తనంటే- అప్పుడప్పుడు వచ్చిపో చెల్లె అని చెయ్యి పట్టుకుంది. ఇక ఈ బస్తిలో నాకేం మిగిలింది బంగారంలాంటి బిడ్డను పోగొట్టుకుంటి. జగన్‌గాని చదువు ఒక సంవత్రం పోతె అయిపోతది. అందాక వండుకుంటడు. నేను మునుగోడు కెళ్లిపోత. ఏనే నీ కాడికి వద్దును గని చూస్తున్నవు గదా మోకాళ్ల నొప్పులు. అడుగుతీసి అడుగేయలేకపోతున్న. ఫ్లోరిన్ నీళ్లతో కాళ్లు వంకర్లు పోయినయి. ఏమనుకోకు. వచ్చిపోతుండు. అన్నంక శలవు తీసుకొని బయటపడ్డ.

అరే జగన్ నీకు తెలుసారా! అంటూ అమ్మ అడిగితే అప్పుడు జ్ఞాపకమొచ్చింది. బుల్లెట్ బండి తీసుకొని కాలేజికి రెండుమూడు సార్లొచ్చిండు. పాజం కల్ల మనిషి దాదాలాగ పోజులు పెడ్తడు వాడే కావచ్చని, తెలుసంటి. 'వాడుట్టి ఆవార టైపమ్మా మాతో కల్వడు.'

"సరెలేరా... ఆ రామనర్సమ్మ బతుకంతా కష్టాల బతుకే మనమేం చేస్తం" అంటూ అమ్మ కథ ముగించింది.

** ** **

నేను బి.ఎ రెండవ సంవత్సరంలో వున్నాను. పరీక్షలకై సిరియస్‌గా చదవటం మొదలుపెట్టిన. ఇంతలో 1969 జనవరిలో జైతెలంగాణ ఉద్యమం మొదలైంది. మొదట ఖమ్మంలో మొదలయ్యింది. దావానలంగా తెలంగాణ అంతట విస్తరించింది. సంక్రాంతి శలవులు అయిపోగానే మేమంతా క్లాసులు బహిష్కరించినం.

జై తెలంగాణ అంటూ ఊరేగింపులు, బహిరంగసభలు మొదలైనయి. హైదరాబాదు నుండి ముఖ్యమైన నాయకులు వచ్చి బహిరంగ సభలల్లో మాట్లాడటం మొదలుపెట్టింద్రు. ఇ.వి.పద్మనాభన్ అనే హైద్రాబాదు కార్పొరేషన్ కార్పొరేటర్ చాలా ఉద్రేకంగా మాట్లాడేవాడు. ప్రతిరోజు ఊరేగింపులు, బహిరంగసభలు. తెలంగాణ అంతటా ఇదే పరిస్థితి. హైద్రాబాదు నిజాం కాలేజిలో విద్యార్థులపై బాష్పవాయు ప్రయోగం, లాఠిచార్జి. ఎంతోమంది విద్యార్థులు చనిపోయింద్రని ప్రచారం జరిగింది. నల్లగొండలో ఉద్యమం ఊపందుకుంది. షేర్ బంగ్లా వద్ద నివాసముంటున్న రంగాచారి అనే ఆంధ్ర సర్వేయరుపై ఎవరో దుండగులు రాత్రిపూట పెట్రోలుపోసి నిప్పంటించితే ఆ మంటలకు అతడు చనిపోయిండు. తెల్లారేవరకు ఈ విషయం గుప్పుమంది. కాలేజి సక్రమంగా నడవటంలేదు. మార్చి నెలలో హైద్రాబాదు రెడ్డి హాస్టల్లో విద్యార్థుల సభ జరిగింది. విద్యార్థుల నిరవధిక సమ్మె ప్రారంభమయ్యింది. హైద్రాబాదులో యువకులు, మేధావులు కలిసి 'ప్రజాసమితి' స్థాపించింద్రు. మార్చి 3న తెలంగాణ బందుకు పిలుపు ఇస్తే ప్రశాంతంగా జరిగింది. విద్యార్థుల నిరవధిక సమ్మెకు సపోర్టుగా తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వెంట నిలిచారు.

కమ్యూనిష్టులు ప్రత్యేక తెలంగాణకు మద్దతు ఇవ్వటంలేదు.

మల్లిఖార్జున్ అనే మెడిసిన్ విద్యార్థి, విద్యార్థి నాయకునిగా ఎదిగాడు. హైద్రాబాదు ఉద్యమం జోరుగా సాగుతుంది. నల్లగొండలో

**కమ్యూనిజాన్ని తుంగలో తొక్కిండు. పార్టి మారిండు, మోసాలు చెయ్యటం మొదలుపెట్టిండు. మాజి కమ్యూనిష్టులు చేసినన్ని మోసాలు వేరేవాళ్ల చెయ్యలేరమ్మ-**

విద్యార్థి నాయకులను యన్‌జిఓ నాయకులను అరెస్టు చేసి జైల్లో పెట్టింద్రు. ఎక్కడ చూచినా తెలంగాణ నినాదమే. గ్రామ గ్రామానికి పాకింది. విద్యార్థులు జై తెలంగాణ అంటూ నినదిస్తున్నారు. హైద్రాబాదు తెలంగాణ ఉద్యమం జోరుగా నడుస్తుంటే విద్యార్థులను అక్రమ కేసుల్లో ఇరికించి అరెస్టు చేస్తున్నారంటూ అక్కడి నుండి వచ్చిన వెంకటేశ్వర్లు చెప్పుకొచ్చిండు. విద్యార్థి నాయకుడు శ్రీధర్‌రెడ్డిని అరెస్టు చేసి రాజమండ్రి జైలుకు పంపింద్రని ఇంకా చాలామందికై వెతుకుతున్నారని దాన్ని తప్పించుకోవడానికి నల్లగొండ కొచ్చినట్లు చెప్పింద్రు. అనేకమంది మహిళలు చురుకుగా ఉద్యమంలో పాల్గొంటున్నారని నగర మేయర్ రాణికుముదిని నాయక్ సదాలక్ష్మి, ఈశ్వరిబాయి, సంగం లక్ష్మిబాయమ్మ మొదలైనవారందులో వున్నారని చెప్పిండు. తెలంగాణ రాక తప్పదు. విద్యార్థులు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా పోరాడుతున్నారు.

నల్లగొండలో ఉధృతంగా వుంది పరిస్థితి. అరెస్టులు జర్గుతున్నయి.

యన్.జి.వోలు నిరవధిక సమ్మె చేస్తుంద్రు. యన్‌జిఓ సెక్రటరి యాదగిరిరెడ్డిని అరెస్టు చేసింద్రు. ముప్పయి ఏడు రోజులు సాగిన సమ్మె ఆఖరికి విరమించింద్రు. యన్‌జిఓలు జీతాలు లేక చాలా ఇబ్బందిపడ్డారు. హైద్రాబాదులో మల్లిఖార్జున్ అనే వైద్య విద్యార్థి నాయకుడు ఇరువైనాల్గురోజులపాటు నిరాహారదీక్ష చేసిండు. ఆఖరికి పోలీసులు బలవంతంగా నిరాహారదీక్షను విరమింపజేసింద్రు.

ఈ మహోద్యమం తొమ్మిది నెలలపాటు జరిగింది. విద్యార్థులు ముఖ్యపాత్ర వహించింద్రు. మొత్తం తెలంగాణలో 360 మంది విద్యార్థులు తమ ప్రాణాలొడ్డారు. వీటన్నిటిని మర్రి చెన్నారెడ్డి ఒడుపుగా తనకు అనుకూలంగా మార్చుకుండు. కేంద్రంతో రహస్య ఒప్పందం చేసుకొని 1969 నవంబర్ 26న ఉద్యమాన్ని వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించి కోలుకోలేని దెబ్బతీసిండు.

●